
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025



సౌత్‌జోన్ పోటీలకు రిఫరీలుగా ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

36వ జాతీయస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్ గా జిల్లా నుండి అయిదుగురు పీడీలు నామినేట్ అయ్యారు. ఈనెల 23 నుంచి నుండి 25వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో జరిగే 36వ జాతీయస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా జిల్లా నుండి అయిదుగురు పీడీలు నామినేట్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అసోసియేషన్ టెక్నికల్ కమిటీ చైర్మన్ హరిబాబు తెలిపారు. వారిలో వి.ఆనంద్ కిషోర్ (జెడ్‌పి హైస్కూలు, నెల్లిమర్ల) , పి.లీలాకృష్ణ (జొన్నాడ హైస్కూలు), జి.గురునాయుడు (జెడ్‌పి హైస్కూలు, బొండపల్లి), ఎం.రామకృష్ణ (జెడ్‌పి హైస్కూలు, చింతలపేట), బిఎం శ్రీకాంత్ (జెడ్‌పి హైస్కూలు, కెఎల్‌పురం) ఉన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారి పండగ

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

పైడితల్లి అమ్మవారి పండగను, విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అమ్మవారి పండగ ప్రతి ఒక్కరి మదిలో మధురస్మృతిగా నిలిచిపోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి పండగ, ఉత్సవ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పండగ కోసం నగరమంతా సుందరీకరణ చేయాలని, రహదారుల పై గుంతలు లేకుండా చూడాలని ఆదేశించారు. జయనగరం ఉత్సవాల్లో గత ఏడాది ఏయే కార్యక్రమాలు నిర్వహించామో అంతకన్నా గొప్పగా ఈ ఏడాది నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమాల వివరాలను, అందుకు ఎంత మొత్తం నిధులు ఖర్చవుతాయో వివరంగా నోటు తయారు చేసి ప్రణాళికా బద్ధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంగా పని చేయాలని తెలిపారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్ని ప్రోత్సహించాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ పండగను, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ విఐపిలను గర్భ గుడిలో ఒక్క నిమిషం కన్నా ఎక్కువ సేపు ఉండకుండా త్వరగా పంపడం వలన సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడవచ్చునన్నారు. సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాల పై వివరించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కలెక్టర్‌ను కలిసిన మంత్రి, ఎమ్‌పి, ఎమ్మెల్యే

మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు శనివారం జిల్లా కలెక్టర్‌గా రామసుందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు.

28 నుంచి సరస్ ఎగ్జిబిషన్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకు అఖిలభారత డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన (సరస్ ఎగ్జిబిషన్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు సంబంధించి తమ ఛాంబర్‌లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. లోయర్ ట్యాంకుబండ్ రోడ్డులోని మాన్సాస్ గ్రౌండ్‌ను ఎగ్జిబిషన్‌కు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ ప్రదర్శనలో మన , రాష్ట్రంతోపాటు 18 రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలు, దుస్తులు, వస్త్రాలు, వివిధ రకాల కలంకారీ వస్తువులు, ఆయుర్వేద ఉత్పత్తులు, గృహోపకరణాలు, మహిళాసంఘాలు సృజనాత్మకతతో సృష్టించిన కళాకృతులను విక్రయానికి ఉంచుతున్నట్లు చెప్పారు. దీనికోసం సుమారు 220 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వారు ఇబ్బంది పడకుండా తగిన వసతి, భోజన సదుపాయాలను కల్పించాలని చెప్పారు. సమావేశంలో జెసి ఎస్.సేధు మాధవన్, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, డిఇఒ మాణిక్యంనాయుడు, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

సమస్యలపై 7న పోరుబాట

ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు అక్టోబర్ 7న విజయవాడ కేంద్రంగా చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పాల్తేరు శ్రీనివాస్ కోరారు. శనివారం విజయనగరం మండలం మలిచర్ల క్లస్టర్ కాంప్లెక్స్ అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. సమస్యల పరిష్కారానికి చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి

రామభద్రపురం : బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించి, విద్యార్థులకు సక్రమంగా పాఠాలు చెప్పే అవకాశం కల్పించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. శనివారం రామభద్రపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఫ్యాప్టో నాయకులు జెసి రాజు, బొప్పే రవికుమార్, సుధాకర్, సత్యారావు ఆధ్వర్యంలో అక్టోబర్ 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రెండు రోజులు దసరా సెలవులు పెంచాలని ఎవరూ కోరలేదని చెప్పారు. ఉపాధ్యాయులు ముక్తకంఠంతో కోరుకునేది 12వ పిఆర్‌సి, మధ్యంతర భృతి, సిపిఎస్ రద్దు, మెమో 57 అమలు వంటివని తెలిపారు. బకాయి పడిన డిఎలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కేశవరావు అధ్యక్షతన జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 450 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 12 కంపెనీలు హాజరై 118 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి భాస్కరరావు, జెకెసి కోఆర్డినేటర్ జి.ఈరన్న, ఉపాధి కల్పన అధికారి యశ్వంత్, వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు పాల్గొన్నారు.

28న బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28న విజయనగరంలో ఓపెన్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కనకల కృష్ణ తెలిపారు. ఈనేపథ్యంలో శనివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మిస్టర్ ఆంధ్ర ట్రోఫీని కోలగట్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనకల ఎర్రయ్య జ్ఞాపకార్థం ఓపెన్ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను గత 12 సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డింగ్ ఉప అధ్యక్షులు శ్రీనివాస్ వర్మ, సెక్రెటరీ బైక్ రమేష్, ఆర్గనైజింగ్ సభ్యులు కోట్ల రమేష్, వంశి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

వర్షాకాలం నేపథ్యంలో కలరా వంటి జలమూల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ జీవన రాణి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విరేచనాలు, వాంతులు, శరీర నిస్సత్తువ, డీహైడ్రేషన్ లాంటి కలరా లక్షణాలు గమనించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాల న్నారు. వ్యాధి వ్యాప్తి ప్రధాన కారణాలైన కలుషిత నీరు, కలుషిత ఆహారం నివారించాల న్నారు. అందుకు తప్పనిసరిగా మరిగించిన లేదా ఫిల్టర్ చేసిన నీరు తాగాలని, తినే ముందు, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత చేతులు కడుక్కోవాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీలు, ప్రజా కార్యాలయాలు శుభ్రత పాటించాలని, పంచాయతీలు, మున్సిపల్ సంస్థలు శుద్ధి నీటిని మాత్రమే సరఫరా చేయాలని తెలిపారు.

పోరాటంతోనే జిఎస్‌టి ఉపసంహరణ

ప్రజాశక్తి- రాజాం

దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) అఖిల భారత ఇన్సూరెన్స్ ఉద్యోగుల యూనియన్ చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం సమీకరణ ఫలితంగా, ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమలులో ఉన్న 18శాతం జిఎస్‌టిని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని ఎస్‌సిజెడ్‌ఐఇఎఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కె గీత ఫార్మర్ అన్నారు. స్థానిక వెంకట దుర్గా కళ్యాణ మండపంలో శనివారం ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేట్ కమిటీ 27వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య జీవిత బీమా ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్‌టి ఉపసంహరణ దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం కృషి అని కొనియాడారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే తీసుకున్న నిర్ణయంతో ఇన్సూరెన్స్ తీసుకునేవారికి పన్నుల భారం తగ్గుతుందని తెలిపారు. సెప్టెంబర్ 22, 2025 నుంచి ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై వస్తు సేవలపై ఈ పైన పన్ను ఉండదని అన్నారు. పూర్తిగా తొలగిస్తూ సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన 56వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుందన్నారు. సిఐటియు నాయకులు బి. సుధారాణి మాట్లాడుతూ ఇంతకు ముందు జిఎస్‌టితో కలిపి ప్రీమియం కట్టేవారని ఇప్పుడు జిఎస్‌టి తొలగించి కట్టుకోవచ్చునని చెప్పారు. సెప్టెంబర్ 22 తేదీలోపు ప్రీమియం కడితే జిఎస్‌టి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిజెడ్ ఐఇఎఫ్ వైస్ ప్రెసిడెంట్ యం.కామేశ్వరి, జనరల్ సెక్రెటరీ జి. వరప్రసాద్, కన్వీనర్ జి. సూర్య ప్రభాకర్, ప్రెసిడెంట్ పి. ప్రభాకర్ రావు, కార్యదర్శి ఎం.జితేందర్‌రావు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌సిజెడ్‌ఐఇఎఫ్ వైస్ ప్రెసిడెంట్ గీత

విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

విజయనగరం టౌన్ : విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శనివారం విద్యుత్ భవన్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఉద్యోగులకు బకాయి ఉన్న 4 డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్, జిపిఎఫ్ అమలు చేసి అందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. అంతేకాకుండా కాంట్రాక్టు / ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరేషన్, ఎనర్జీ అసిస్టెంట్ల రెగ్యులరేషన్ అండ్ ప్రమోషన్, ఉద్యోగులకు పూర్తి వైద్య సదుపాయాలు కల్పించాలని, ట్రాన్స్ కో నిర్వహిస్తున్న సబ్ స్టేషన్ లను ప్రైవేట్ వారికి అప్పగించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయనగరం సర్కిల్ లో ఉన్న మహిళా ఉద్యోగులు, పెన్షనర్లు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం లో ఎపి పవర్ జెఎసి జిల్లా చైర్మన్ సురగాల లక్ష్మణ్ , కన్వీనర్ బండారు రాజేష్ కుమార్, కో. చైర్మన్ పప్పల అప్పలస్వామి నాయుడు, వైస్ చైర్మన్ మందపల్లి నిర్మలా మూర్తి, రుంకాన అప్పల నాయుడు, పూసపాటి సీతారామరాజు, ఎస్.నర్సింగరావు, గేదెల దేముడు ఎన్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆధార్ ఒటిపిని రద్దు చేయాలని చీపురుపల్లిలో డాక్యుమెంట్ రైటర్లు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు శనివారం నిరసన తెలిపారు. గత రెండు రోజులుగా డాక్యుమెంట్ రైటర్లు తమ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం కూడా చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు. సబ్‌రిజిస్ట్రార్ టివిఎస్‌కె లక్ష్మణరావుకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుప్పిలి కాశీవిశ్వేశ్వరరావు, డాక్యుమెంటు రైటర్లు గంట్యాడ విష్ణుమూర్తి, యలకల సూరిబాబు, ఆర్ సతీష్‌నాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

ఫ్లెక్సీల తొలగింపుపై పాలకవర్గం నిరసన

- కమిషనరా? రాజకీయ నాయకుడా?
- కమిషనర్ తీరుపై టిడిపి సభ్యురాలు రాధామణి ఆగ్రహం
- వార్డుల్లో సమస్యలపై సభ్యులు ఏకరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల రెండు రోజుల క్రితం నగరంలో అనుమతులు తీసుకుని పెట్టిన డిప్యూటీ మేయర్ శ్రావణి ఫ్లెక్సీలు తొలగించడం పట్ల పాలకవర్గ సభ్యులు నిరసన తెలిపారు. శనివారం నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరిగింది. ఎజెండాకు ముందు జరిగిన చర్చల్లో కార్పొరేటర్లు దాసరి. సత్యవతి మాట్లాడుతూ తమ ఫ్లెక్సీల మీద ఫ్లెక్సీలు వేసినా వారిని వదిలేసి మా ఫ్లెక్సీలు తొలగించి మహిళల పాలకులను అవమానించారని అధికారులు తీరుపై మండిపడ్డారు. మరో కార్పొరేటర్ బి.ధనలక్ష్మి మాట్లాడుతూ ఫ్లెక్సీలు తీసేయడానికి కారణం ఏమిటి. ఎందుకు తీసేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తీసుకొని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం సరికాదన్నారు. కో ఆప్షన్ సభ్యులు ఆశపు వేణు మాట్లాడుతూ ఎప్పుడూ లేని సంస్కృతి ఇప్పుడు ఎందుకొచ్చిందనిప్రశ్నించారు. మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్ల ఫ్లెక్సీలను తొలగించడం సరికాదన్నారు. అన్ని రాజకీయా పార్టీలతో సమావేశం పెట్టీ సరైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. తాము పండగకు నిధులు ఇస్తున్నా ప్రోటోకాల్ ఎందుకు దేవాదాయ శాఖ వారు పాటించడం లేదని ప్రశ్నించారు. ఫ్లెక్సీలు తొలగించిన వారు క్షమాపణ చెప్పాలని సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం ఎసిపి రమణమూర్తి, కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ఫ్లెక్సీలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం పెట్టి ఒక నిర్ణయం తీసుకొని దాని ప్రకారం అమలు చేస్తామని తెలిపారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ అసలు ఎందుకు ఫ్లెక్సీలు తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ మారోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ కుక్కలు బెడద చాలా ఎక్కువగా ఉందని, ఇటీవల ఒకరు చనిపోయారని, కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు తప్ప ప్రయోజనం లేదన్నారు. విద్యుత్, పంపు హౌస్ లు నిర్వహణకు 12 నెలలు కాలానికి టెండర్లు పిలవాలని కోరారు. టిడిపి కార్పొరేటర్ కర్రోతు రాధామణి మాట్లాడుతూ అధికారులు డివిజన్ పర్యటనకు వస్తే కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. కమిషనర్ అధికారా? లేదా రాజకీయ నాయకులా అని ప్రశ్నించారు. సక్రమంగా ఉండకపోతే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రూ.200 కుళాయిలు ఎందువలన ఆపేశారో చెప్పాలన్నారు. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన కార్పొరేటర్ సుంకరి బాబు మాట్లాడుతూ లాయర్ పంపించిన లేఖ ఆధారంగా కంటోన్మెంట్ లో వేయాల్సిన రోడ్డు ఎలా ఆపేస్తారని ప్రశ్నించారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ పరిపాలన ఆమోదం, టెండర్ ఆమోదం అయిన తర్వాత కూడా రోడ్డు వేయకపోవడం సరికాదన్నారు. కె ఎల్ పురం కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి మాట్లాడుతూ కె ఎల్ పురం లో సూర్యగార్డెన్ ప్రాంతంలో రోడ్డు ను ఆక్రమించి భవనం కట్టేస్తున్నారని,ఫిర్యాదు చేసినా చర్యలు లేవని అన్నారు. కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనాలు పెంచే విషయంలో వారి పనితీరు ఆధారంగా పెంచాలని రాజేష్ సూచించారు.



ఫ్లెక్సీల తొలగింపుపై నిరసన తెలుపుతున్న పాలకవర్గ సభ్యులు

ఎజెండాలో అంశాలు ఆమోదం

అనంతరం సాధారణ ఎజెండాలోని 19 అంశాల్లో 18 అంశాలను ఆమోదించి,ఒక అంశాన్ని వాయిదా వేసారు. వివిధ అభివృద్ధి పనులు, ఉద్యోగుల వేతనాలు పెంపు వంటి అంశాలను ఆమోదించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు శ్రావణి, లయ యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, అన్ని విభాగాలు అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణం పరిశీలన

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లిలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న కోర్టు ప్రాంగణాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవికుమార్ పరిశీలించారు. అనంతరం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు గవిడి నాగరాజుతో పాటు మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ స్వాగతం పలికారు. ఆలయ ఇఒ శ్రీనివాసరావు న్యాయమూర్తికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పుర్రేయవలస గ్రామ సమీపంలో ఉన్న మానసాదేవి అమ్మవారిని ఆయన దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబితతో పాటు పలువురు న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సత్యం, న్యాయవాదులు పాల్గొన్నారు.



హైకోర్టు జడ్జి రవికుమార్‌ను కలిసిన శృంగవరపుకోట న్యాయవాదులు

కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించండి


శృంగవరపుకోట : శృంగవరపుకోటలో నూతన కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి చీమలపాటి రవిని ఎస్.కోట న్యాయవాదులు కోరారు. ఈ మేరకు విజయనగరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన్ను కలిసి, సమస్యను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బివిఎస్ రామారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, మీడియా సెక్రటరీ డబ్ల్యు.ఎన్.శర్మ, సంయుక్త కార్యదర్శి బడబళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాం

ఎఆర్ పోలీసుల వీడ్కోలు పరేడ్‌లో ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లా ఎస్‌పిగా 14 నెలలు పని చేసి బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్ళిన వకుల్ జిందల్‌కు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో శనివారం వీడ్కోలు పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారం, సమన్వయంతో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపామన్నారు. గంజాయి మూలాలను సమూలంగా నాశనం చేసామని, గంజాయి అక్రమ రవాణకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి, వారి ఆస్తులను కూడా అటాచ్ చేసామన్నారు. అనంతరం ఎస్‌పిని సత్కరించి, జ్ఞాపికను సాయుధ పోలీస అధికారులు బహూకరించారు. ఎస్‌పి వకుల్ జిందల్ ను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఎక్కించి, అధికారులు, సిబ్బంది తమ స్వహస్తాలతో వాహనాన్ని పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి. సౌమ్యలత, జి. నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, ఎం.వీరకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

పిడుగుపడి గిరిజన మహిళ మృతి


ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్.కోట పంచాయతీ డంపింగ్‌యార్డు వెనుక శనివారం సాయంత్రం పిడుగు పడి గిరిజన మహిళ మృతి చెందింది. సింబోయిన చెల్లమ్మ (40) శుద్ధగరువు ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తుండగా వర్షం కురిసింది. పిడుగు పడడంతో పొలంలోనే మృతి చెందింది. రాత్రి 7గంటల వరకు ఇంటికి రాకపోవడంతో భర్త గొట్టయ్య పొలంలోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఆమె మృతదేహం పడి ఉండటాన్ని గమనించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విరాజిల్లిన విజ్ఞానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! విజ్ఞాన వీచిక విరాజిల్లింది. మానవాళి మనుగడలో శాస్త్ర విజ్ఞానం, వైజ్ఞానిక ప్రదర్శనలు, అభ్యుదయ ఆలోచనలు ఎంత ముఖ్యమో నొక్కివక్కానించి చెప్పింది. అంతటితో ఆగిపోలేదు... సైన్స్ ప్రత్యేకతను నిరూపించేందుకు కూడా కంకణబద్ధులై పనిచేయాలని ఉక్కు సంకల్పాన్ని ప్రదర్శించింది. గడిచిన వారంలో జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల్లో ఇది అత్యంత ముఖ్యమైనదే. అదే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభ. రెండు రోజులపాటు జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంతో మంది వైద్యులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు అభ్యుదయవాదులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, అభివృద్ధికాముకులు కలిసి అజ్ఞానపు ఆలోచనలు, తిరోగామి శక్తుల కుట్రలపై ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తిప్పికొట్టేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కూడా లక్ష్యం పెట్టుకున్నారు. ఈ పరిణామం ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇందులో పనిచేస్తున్నదెవరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాదు. ఎన్నికల జెండా, అజెండా ఉన్నవారు అసలే లేరు. కానీ, వీరంతా రాజకీయాలను మనం పట్టించుకోకపోయినా, మనల్ని రాజకీయాలు ప్రభావితం చేస్తాయన్న మూలసూత్రాన్ని మాత్రం మర్చిపోలేదు. ఇందుకనుగుణంగా అభ్యుదయ కవిగా విశ్వఖ్యాతిగాంచిన గురజాడ అప్పారావు జయంతిని



ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆయన స్వగృహాన్ని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, గురజాడ పేరిట ఓ సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ప్రయివేటీకరణ, సరళీకరణ, కాషాయీకరణకు కారణమౌతున్న నూతన విద్యావిధానాన్ని రద్దుచేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలనే జన విజ్ఞానవేదిక మహాసభ తీర్మానాలు, వాటికి ఆమోదం తెలపడం పట్ల విజయనగరం వాసుల్లో హర్షధ్వానాలు వ్యక్తమౌతున్నాయి. మహాసభల్లో రెండోరోజు చేపట్టిన సైన్స్‌వాక్‌లో వేలాది మంది స్థానికులు హాజరు కావడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని జనం చర్చించుకుంటున్నారు. ఇంతే కాదు... పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మహాసభలో పెద్దఎత్తున చర్చ జరిగింది. పర్యావరణ పరిరక్షణ అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధం వంటివి మాత్రమే కాదంటూ వక్తలు బోధించిన విజ్ఞానంతో పెట్టుబడిదారుల దురాశ కారణంగా ప్రాణవాయువులను కూడా కోల్పోతున్న సంగతి తెలియపర్చింది. ఓవైపు శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న పరిస్థితుల్లో మూఢనమ్మకాలు వంటి అశాస్త్రీయ ధోరణులు కూడా పెచ్చుమీరుతున్నాయి. ఇటువంటి తరుణంలో విజయనగరంలో జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలో సైన్స్ ఫలితాలు కొందరికే పరిమితమౌతున్నాయని, ఇవి సమాజంలో సమ్మిళితం కావాల్సిన అవసరం ఉందని వక్తలు చెప్పిన అంశాలు విజయనగరం, పార్వతీపురం వాసులను కొంతమేరకైనా శాస్త్రీయ ఆలోచనల వైపు నడిపాయడంలో సందేహం లేదని జనం చర్చించుకుంటున్నారు.

అసత్య ప్రచారాలు ఆపాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 19న వైసిపి నాయకులు చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం చేపట్టడం విడ్డూరంగా ఉందని, అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గంటా రవి అన్నారు. శనివారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే కాదు జిల్లాలో కూడా వైసిపి మనుగడ కోల్పోతుందని, ఈనేపథ్యంలోనే ఉనికి కోసం మెడికల్ కాలేజీని ప్రైవేటు పరం చేస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. టిడిపి హయాంలోనే ఆస్పత్రిలో అనేక సౌకర్యాలు కల్పించిన విషయాన్ని గమనించాలని కోరారు. 300 పడకల ఆస్పత్రిగామార్చిన ఘనత టిడిపిదేనని అన్నారు. తెలుగు యువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గొలగాని సురేంద్ర మాట్లాడుతూ మెడికల్ కాలేజీ కోసం 2021 నుంచి 2024 మార్చి 31 వరకు వైసిపి హయాంలో 86 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టారని, టిడిపి వచ్చిన తరువాత జూన్ 1 నుంచి నేటి వరకు 96 కోట్లు ఖర్చుపెట్టిందని తెలిపారు. పట్టణ యువత అధ్యక్షులు మాతా బుజ్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొగిరి పైడ్రాజు మండల ప్రధాన కార్యదర్శి మజ్జి పైడిరాజు, మద్దిల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

నెల్లిమర్ల : మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ అన్నారు. శనివారం స్థానిక ఇందిరా కాలనీ సచివాలయం-4లో స్వస్తి నారి స్వశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఆరోగ్యంపై ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంలో ఎటువంటి ఇబ్బందులు కనిపించినా వెంటనే వైద్యుని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ టి జయరాం, యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శిరీష, సూపర్ వైజర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు చిట్టితల్లి, మహాలక్ష్మి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల వినతుల స్వీకరణ

భోగాపురం : జనసేన పార్టీ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాలతో స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గత ఆరు రోజులుగా వినతులను స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జనసేన నాయకుడు పల్ల రాంబాబు ఆధ్వర్యంలో వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, శిరుగుడి వెంకటేష్, గరె రామదాసు పాల్గొన్నారు.

అసైన్డ్ కమిటీని పునరుద్ధరించాలి

మెంటాడ : అసైన్డ్ కమిటీని పునరుద్ధరించాలని ఏపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఇప్పలవలసలో 22న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ మిగులు భూములు నిరుపేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సోములు, మంగళగిరి అప్పలనర్సయ్య, చిలక సన్యాసి, సిడగం అంగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

దత్తిరాజేరు : పెదకాద రైతు సేవా కేంద్రం వద్ద తహశీల్దార్ పి.విజయ భాస్కర్, ఎఒ అనురాధ ఆధ్వర్యాన పోలీస్ సిబ్బంది సహకారంతో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. 267 యూరియా బస్తాలు పెదకాద, మజ్జిపేట రైతులకు అందజేశామని ఎఒ తెలిపారు. ఎం.లింగాలవలస, చినకాద రైతు సేవా కేంద్రాల వద్ద కూడా యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ సహాయకుల సలహాలు పాటించి ఎరువులు వాడాలన్నారు.

పాఠశాలలో తాగునీటి బోరు

గజపతినగరం : కెంగువలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మండల పరిషత్తు నిధులు రూ.1.30 లక్షలతో తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం బోరు ఏర్పాటుకు సర్పంచ్ ప్రతినిధి లెంక గణేష్ ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు.

మెసెంజర్ సేవలు అమూల్యం

రామభద్రపురం : ఎస్‌బిఐ బ్రాంచిలో మెసెంజర్‌గా పనిచేస్తున్న జగదీశ్ రోజూ ఖాతాదారులకు అందిస్తున్న సేవలు అమూల్యమని మేనేజర్ నాగరాజు కొనియాడారు. శనివారం ఎస్‌బిఐ సిబ్బంది ఆధ్వర్యంలో మెసెంజర్ జగదీశ్‌కు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిన్ని సేవలు కొనసాగించి బ్యాంకు పురోభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, క్యాష్ ఇన్‌ఛార్జి హరికృష్ణ, సిబ్బంది లక్ష్మునాయుడు, ధర్మారావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రజాశక్తి - గరివిడి

స్థానిక పశువైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ వారోత్సవాలలో భాగంగా అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కెన శ్రీను ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ ఫలాలను అందించే అవెన్యూ మొక్కలు, నీడను అందించే మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సిహెచ్ జ్యోతిశ్రీ, డాక్టర్ ఎస్ గంగునాయుడు, డాక్టర్ వై.స్వాతి, డాక్టర్ కె.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆతవలో వైద్య శిబిరం

వేపాడ : మండలంలోని ఆతవ గ్రామంలో శనివారం ఎస్ఎన్ఎస్‌పిఎ కార్యక్రమంలో భాగంగా వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.సంజన ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 45 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శిరీషా, పి.గగనసింధు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, వైద్య సిబ్బంది ఎం.ప్రభాకర్‌రావు, తదితరులు

చామలాపల్లిలో పశువైద్య శిబిరం

వేపాడ : మండలంలోని చామలాపల్లి గ్రామంలో శనివారం పశువైద్యాధికారి కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పశువులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు అపార్ ఐడి ఉండాలి

గంట్యాడ : అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు అపార్ ఐడిలు తప్పనిసరిగా ఉండాలని సూపర్వైజర్ అనురాధ అన్నారు. బుడతనపల్లి ఆరోగ్య కేంద్రంలో శనివారం జరిగిన రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి లబ్ధిదారునికీ పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌లలో తప్పనిసరిగా ఆధార్ నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వందన, ఆరోగ్య కార్యకర్త రమణమ్మ, అంగన్వాడీలు రమణమ్మ, బంగారమ్మ, కృష్ణమ్మ, మదీనా, రాజేశ్వరి పాల్గొన్నారు.

గరికివలసలో పొలంబడి

గుర్ల : గరికివలస గ్రామంలో శనివారం సర్పంచ్ బెల్లాన సన్యాసమ్మ అధ్యక్షతన ఇండిగ్యాప్ పొలంబడి నిర్వహించారు. రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఎవల్యేటర్ పి.కూర్మారావు మాట్లాడుతూ రైతులు పొలాల్లో పంటలకు రసాయనిక ఎరువులు పురుగుమందులను సిఫారసు మేరకు మాత్రమే వాడాలన్నారు. అనంతరం సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాలను సందర్శించారు.



ఎరువులు పంపిణీ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

ఎరువుల కొరత లేదు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఎరువుల కొరత లేదని, రైతులకు పూర్తిస్థాయిలో సరఫరా చేస్తామని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని వావిలపాడు, బల్లంకి, గుడివాడ, జగ్గయ్యపేటలో ఎరువుల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఎంఎస్ స్వాతికుమారి, విఎఎ నాయుడు పాల్గొన్నారు.

అంగన్వాడీల డిజిటలీకరణ

బొబ్బిలిరూరల్ : ప్రతి అంగన్వాడీ కేంద్రం డిజిటలీకరణ జరగాలని సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. శనివారం పిరిడి పిహెచ్‌సిలో పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని అంగన్వాడి కేంద్రాలలో ప్రీస్కూల్ పిల్లలకు అపార్ ఐడి నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రఘు వంశీ, భరద్వాజ్ , సర్పంచ్ వరలక్ష్మి, గ్రామ పెద్దలు రామకృష్ణ, రంగారావు, రామారావు, సూపర్వైజర్ కె.పద్మ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ

గంట్యాడ : మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ మదనాపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఆధ్వర్యాన విద్యార్థులు శనివారం తాటిపూడి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు మాదకద్రవ్యాల నిషేధంపై వీధి నాటకాన్ని ప్రదర్శించారు. పంచాయతీ కార్యదర్శి ధనంజయ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గంట్యాడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్రపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర సాధనకు తమవంతు కషి చేస్తామని సభికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మండల పరిషత్ కార్యాలయం, సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, అహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన పరిసరాలను ఏర్పాటు చేసి, తద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కషి చేసేందుకు ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. వ్యాధులు సోకకముందే, వాటిని నివారించడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ దినకర్, డిపిఒ మల్లికార్జున రావు, ఎంపిపి పి.హైమావతి, జెడ్‌పిటిసి వర్రి నర్సింహమూర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాములమ్మ, తహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టెర్రస్ గార్డెన్ ను ప్రోత్సహించండి : కలెక్టర్

విజయనగరంటౌన్ : ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి దత్తత తీసుకోవాలని, వీలు కాని పక్షంలో టెర్రస్ గార్డెన్ ను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఎస్ రామ సుందర్ రెడ్డి సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రింగ్ రోడ్డు వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెట్ల సంరక్షణలో రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, పాఠశాలలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టెర్రస్ గార్డెన్ ద్వారా ఇంట్లోకి అవసరమైన కూరగాయలు పండించుకోవచ్చని, మొక్కలకు సేవ చేయడం ద్వారా శారీరక శ్రమతో ఆరోగ్యం మెరుగుపడుతుందని , ఇంటి వ్యర్థాలతో సహజ ఎరువులు తయారు చేయవచ్చని, కలెక్టర్ వివరించారు. అనంతరం పార్కులో మొక్కలు నాటి, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కూడలి వద్ద మనవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జెడ్‌పి సిఇఒ డి.సత్యనారాయణ, మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ కె.సాంబమూర్తి, ఇ ఇ పిఎస్ వివి ప్రసాద్, డిఇఇ శ్రీనివాసరావు, ఎసిపిలు రమణమూర్తి, హరిబాబు, మెప్మా పీడీ చిట్టిబాబు, తాహశీల్దార్ కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.

- జెఎన్‌టియు జివి ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మణికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి జె నాగరాజు, హెచ్‌అండ్ఎస్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : డిఎంహెచ్ఒ

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ ఎస్ జీవన్ రాణి సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు .జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఎన్.రాణి, అర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త వివిబి సుబ్రమణ్యం , డిఐఒ అచ్యుత కుమారి, జిల్లా అధికారి డెమో వి.చిన్న తల్లి, హెచ్.ఇ లు,రాజు ఎన్.అనిల్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ పై ర్యాలీ

రేగిడి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ శ్యామలకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ఇఒపిఆర్‌డి జగన్నాథ రావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సిహెచ్ పద్మ, ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాం: పొగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఐలు మాన్యాలు, మహేష్, సిబ్బంది ఆనంద్, మూర్తి, గీతా, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సి.హెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. మొక్కలు నాటి, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి లీల, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, టిడిపి నాయకులు సేనాపతి అప్పారావు, ఎంఇఒ పి.బాలభాస్కర్‌రావు, ఎఒ ఎం.ఎస్ స్వాతి, ఎపిఎం సన్యాసిరావు, ఎపిఒ ఆదిలక్ష్మి, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ రాంబాబు, కార్యదర్శి రంగారావు పాల్గొన్నారు.

మెంటాడ : మెంటాడ గ్రామ సచివాలయం వద్ద పారిశుధ్య కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.ఎంపిడిఒ జి.పార్వతి, తహశీల్దార్ అరుణ్‌కుమారి, మండల సూపరింటెండెంట్ ఎ.భానుమూర్తి, ఎపిఒ చిన్నప్పయ్య, ఎఒ గోకులకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణ, రెడ్డి రాజు, గోపాల్ పాల్గొన్నారు.

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎఎంసి చైర్మన్ గోపాల రాజు, ఎంపిపి ప్రతినిధి బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ ముందుగా విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కళ్యాణి, ఇఒ జనార్దన్ రావు, ఎంఇఒ విమలమ్మ, ప్రధానోపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక రాణి మల్లమ్మదేవి మున్సిపల్ పార్కులోస్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ రామలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, అధికారులు చీపుర్లు పట్టుకుని పార్కును శుభ్రం చేశారు.


చీపురుపల్లి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలను నాటారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుండి మండల పరిషత్ కార్యాలయం వరకు పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి, టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, జనసేన నాయకులు కోట్ల కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



ఎఎంసి ఛైర్మన్‌కు వినతినిస్తున్న పాలకవర్గ సభ్యులు

గజపతినగరం మార్కెట్ యార్డులో
ప్రతీ ఆదివారం పశువుల సంత

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం మార్కెట్ యార్డులో ఇకపై ప్రతీ ఆదివారం పశువుల సంత నిర్వహించనున్నట్లు ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు తెలిపారు. శనివారం ఎఎంసి కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శుక్రవారం నిర్వహిస్తున్న సంతను ఆదివారానికి మారుస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్ పరిధిలో రెండున్నర ఎకరాలు భూమిని కేటాయించి, పశువులకు, రైతులకు, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకానికి అనువుగా షెడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించడానికి రూ.కోటీ 25 లక్షలతో అంచనా ప్రతిపాదనలను సంబంధిత కమిషనర్‌కు పంపించినట్లు తెలిపారు. గోడౌన్ల మరమ్మతులకు రూ.40 లక్షలతో ప్రతిపాదన పంపించామని చెప్పారు. ప్లాట్ఇన్ ఫ్యాక్టరీ కోసం మార్కెట్ యార్డు పరిధిలో రెండు ఎకరాల భూమిని కేటాయించామని తెలిపారు. దీని ద్వారా షాపులను రైతులకు లీజు ప్రాతిపదికన ఇస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, కార్యదర్శి చంద్రమౌళి, జనసేన డైరెక్టర్ పైల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో ఇంట్రా - కాలేజ్ హ్యాక్‌థాన్

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, ఐటి డిఇ విభాగాల మద్దతుతో ఇంట్రా-కాలేజ్ 24 గంటల హ్యాక్‌థాన్ - సంకల్ప్ 2025ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్ మాట్లాడుతూ భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఆవిష్కరణ, సమస్య పరిష్కారం, పరిశ్రమ-విద్యా సహకారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి 164 జట్లు రిజిస్ట్రేషన్లతో 724 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 51 జట్లు, 229 మంది విద్యార్థులను ఈ 24 గంటల హ్యాక్‌థాన్‌లో పోటీ పడటానికి ఎంపిక చేశామన్నారు. ఇందులో ఉత్తమ ఆవిష్కరణలకు రూ.30వేలు నగదు బహుమతిగా ఇస్తామని ఈ హ్యాకథాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ సంతోష్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ అరుణ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎ పాయింట్లు వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కార్మికులకు కరువు భత్యం (డిఎ)ప్రకటించాలని జ్యూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇంతవరకు డిఎ పాయింట్లు ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో కార్మికులు ఇబ్బందులుపడి జీవిస్తున్నారని దానికి అనుగుణంగా పెంచాల్సిన కరువు భత్యం పాయింట్లు అధికార్లు ఇంతవరకు ప్రకటించకపోవడం సమంజసం కాదన్నారు. గత నెలలోనే డిఎ పాయింట్లు ప్రకటించాల్సి ఉందని రెండు నెలలు గడుస్తున్నా కార్మికులంటే లేబర్ అధికారులకు లెక్క లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

విద్యతో పాటు రాయితీలు వినియోగించుకోండి

ప్రజాశక్తి- రేగిడి

వికలాంగ విద్యార్థులు విద్యతోపాటు ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోవాలని ఎంఇఒ ఎం.వరప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక భవిత కార్యాలయంలో ఐఇపి ప్రోగ్రాంలో భాగంగా బిఇడి డైట్ విద్యార్థి వికలాంగ విద్య గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పరికరాలు, రాయితీలు వినియోగించుకోవాలన్నారు. వీరితో పాటు సహిత ఉపాధ్యాయులు యు మహేశ్వరి, రాజేష్ ఉన్నారు.

రసాభాసగా మండల సమావేశం

ప్రజాశక్తి- సంతకవిటి

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఎంపిపి సిరిపురపు మంజు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. మందుగా కావలి సర్పంచ్ తమ్మినైనా రవీంద్రనాయుడు మృతికి అధికారులు, ప్రజా ప్రతినిధులు నివాళి అర్పించారు. సమావేశానికి టిడిపి సర్పంచ్, ఎంపిటిసిలు ఒక్కరు కూడా హాజరు కాలేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు సిరిపురపు జగన్మోహన్ రావు, వైసిపి ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. దీంతో సభ్యులు మండల అధికారులకు ప్రశ్నల వర్షం కురుపించారు. కూటమి నాయకులు అనుకూలంగా అధికారులు పనిచేస్తున్నారని సభ్యులు మండి పడ్డారు. దీంతో అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల మధ్యలో మండల అధికారులు నలిగిపోతున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వైసిపి సానుభూతి పరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలుపువేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని 789 ఇళ్ళకు బిల్లులు అర్థంతరంగా నిలిపివేశారని సభ్యులు మండిపడ్డారు. ఎన్ఆర్ఈజిఎస్ పనుల్లో వేతనాలు ఆగష్టు 16వరకే పడ్డాయని, తరువాత బిల్లులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. మండలంలోని ఖాళీ ఉన్న 9 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చెయ్యాలని, తొలగించిన వారిలో సగం మంది వైసిపి వారే ఉన్నారని ఆగ్రహించారు. మండలంలోని యూరియా కొరత ప్రధానంగా ఉందని అధికారులను సభ్యులు నిలదీశారు. 300 ఎకరాలు ఉన్న కావలి గ్రామానికి 20మెట్రిక్ టన్నులు, 1100 ఎకరాలు ఉన్న తాలాడకు 10మెట్రిక్ టన్నులు పంపిణీ చెయ్యడమేంటని తాలాడ ఎంపిటిసి కనకల సన్యాసి నాయుడు ఎఒను ప్రశ్నించారు. మండవ కురిటిలో అంగన్వాడి టీచర్ రిటైర్డ్ అయిపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఆయాకు టీచర్ ప్రోమిషన్ ఇవ్వాలని జీవోలో ఉన్నప్పటికి ఆమె వైసిపి సానుబూతి పరురాలని ప్రమోషన్ నిలిపివెయ్యడ మేంటని ఐసిడిఎస్ మండవకురిటి సూపర్‌వైజర్ కరుణశ్రీపై జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు సిరిపురపు జగన్మోహన్ రావు మండిపడ్డారు. తమరాం నుండి పొందూరుకు వెళ్లే రహదారి గోతులమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిఎన్‌పురం గ్రామానికి సాగునీరు రావడంలేదని సర్పంచ్ పి.ఈశ్వరరావు మడ్డువలస రిజర్వాయర్ ఎఇ రవీంద్రను కోరారు. ఎంపిడిఒ కె.సురేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

పాఠశాలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు శనివారం రెల్లివలస జెడ్‌పి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న బోధన, అభ్యసన కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన వసతి, ఎటిఎల్ తరగతి గది మొదలైనవాటిని పరిశీలించారు. ఎస్ఎఎస్ఎ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రెల్లివలస గ్రామ పెద్దలు మహంతి శంకర్రావు, ఇజ్జురోతు ఈశ్వరరావు, చల్లవానితోట గ్రామ పెద్ద పతివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎటిఎల్ ల్యాబ్ సందర్శన

అనంతరం ఎటిఎల్ ల్యాబ్‌ను డిఇఒ సందర్శించారు. విద్యార్థులు తయారుచేసిన డ్రోన్, 3డి మోడల్స్, రోబోటిక్స్ ప్రదర్శనను పరిశీలించి గైడ్ టీచర్ అమర్నాథ్‌ని అభినందించారు. అనంతరం క్లస్టర్ ఉపాధ్యాయుల సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఒతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బలివాడ శంకర్రావు, మండల విద్యాశాఖ అధికారి-1 రాజకుమార్ పాల్గొన్నారు.

ఎటిఎల్ ల్యాబ్‌లో రోబోటిక్ ప్రదర్శనను పరిశీలిస్తున్న డిఇఒ



గ్రామాల్లో పచ్చదనం పెంచాలి : ఎమ్మెల్యే

శృంగవరపుకోట : గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ధర్మవరంలో శనివారం నిర్వహించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారవుతామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, నాయకులు లగుడు తిరుపతి రావు, లగుడు ఎర్నాయుడు, డోకుల అచ్చెం నాయుడు, ఎంపిడిఒ సతీష్, ఇఒపిఆర్‌డి లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం అభివృద్ధి పనులపై కమిషనర్ రామలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అంచనాలు వేసి టెండరు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ గ్రాంటు నిధులతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. వీధి దీపాలు, తాగునీటి పైపులైన్ లీకులను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఇ కిరణ్ కుమార్, ఏఇలు గుప్తా, కోటేశ్వరరావు ఉన్నారు.

మమ్మల్ని ఆదుకోండి

ప్రజాశక్తి - చీపురుపల్లి

'మాకు కొన్నేళ్లుగా అన్యాయం జరుగుతోందని మమ్మల్ని ఆదుకోవాలని మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కి జి.అగ్రహారం రైతులు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా శనివారం బెల్లాన నివాశంలో రైతులు ఆయన్ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తమ తాత ముత్తాల నుండి తాము సుమారు 1190 ఎకరాల భూమిని 375 మంది రైతులం సాగు చేసుకుంటూ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నామని, అయితే ఆ భూమిపై తమకి ఎలాంటి హక్కూ లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావలసిన రాయతీలు రాకుండా పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి పూర్తి హక్కు కల్పించ డంతో పాటు తమకు శాశ్వత పరి ష్కారం చేకూర్చే విధంగా అండగా నిల వాలని రైతులు కోరారు.